# 100 పబ్లిక్ స్కూళ్లు

-మొదటిపేజీ తరువాయి

పరిధిలో నిర్దేశించుకున్న 12 ఇంటిగ్రేటెడ్ నూతన పాఠశాలల నిర్మాణం పూర్తి కావాలి. నగరంలోని భారతీయ విద్యా భవన్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లలో ఉండే అన్ని వసతులు ఈ ఇంటిగ్రేటెడ్ పాఠశాలల్లో ఉండాలి. క్యూర్‌లో అప్‌గ్రేడ్ చేయనున్న 17 పాఠశాలలు, అదనపు గదులు, ఇతర వ సతులు కల్పించనున్న 164 పాఠశాలలకు సంబంధించిన పనుల్లో ఎటువంటి రాజీ పడకూడదు. ప్రభుత్వఆధ్వర్యంలో 99 రోజుల పాటు చేపట్టనున్న కార్యక్రమాల్లో వారంరోజులు విద్యా సంబంధిత అంశాలకు కేటాయించాలి. ప్రజా ప్రతినిధులు, అధికారులు.. పాఠశాలలు, కళాశాలలను సందర్శించి అవసరమైన వసతు ల కల్పన, ఇతర అంశాలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి..' అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**2026--2027 నుంచి బ్రేక్ ఫాస్ట్, పాలు**

'ఆరి?టఫీషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచాన్ని శాసిస్తున్న నేపథ్యంలో పాఠశాల స్థాయి నుంచి దాని బోధనకు అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలి. ఏఐపై బోధకులకు శిక్షణ ఇవ్వాలి. సాంకేతిక విద్యలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ముందుకు వెళ్ళాల్సి ఉంది. పాలిటెక్నిక్ కళాశాలలు, ఏటీసీల్లో ఏఐ ఆధారిత కోర్సులు వెంటనే ప్రారంభించాలి. 2026--2027 విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ అమలు చేయాలి. ప్రాథమిక స్థాయి నుంచి 12వ తరగతి విద్యార్థుల వరకు ఉదయం పూట అల్పాహారం ఇవ్వాలి. (ఈ పథకం అమలుకు సంబంధించి హరేకృష్ణ మిషన్ ప్రతినిధులకు సీఎం పలు సూచనలు చేశారు). బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు ప్రతి విద్యారి?థకి పాలు అందజేయాలి. పాలను విజయ డెయిరీ నుంచి సేకరించాలి. విద్యార్థులకు ఎన్ని కేలరీలు అందజేస్తున్నామో తెలుసుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి.

**ఈ ఏడాది నుంచి విద్యార్థులకు కిట్**

పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, పుస్తకాలతో పాటు ఈ ఏడాది నుంచి ఒక కిట్ అందజేయాలి. అందులో స్కూల్ బ్యాగ్, పెన్నులు, పెన్సిళ్లు, షార్ప్‌నర్లు, రంగుల పెన్సిళ్లు, జామెట్రీ బాక్సులు, డిక్షనరీ, బూట్లు, సాక్సులు ఉండాలి. ఇందుకు సంబంధించిన మొత్తాన్ని బడ్జెట్‌లో పొందుపర్చేలా చూడాలి. అన్ని విశ్వ



విద్యాలయాలకు నిధులు కేటాయిస్తాం..' అని సీఎం తెలిపారు. అవసరమైన నిధులపై నివేదిక ఇవ్వాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డిని సీఎం ఆదేశించారు.

**ఫీజులపై కలెక్టర్లు నివేదిక ఇవ్వాలి**

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఫీజుల విధానం, తెలంగాణలో తీసుకోవాల్సిన చర్యలను ఈ సందర్భంగా అధికారులు వివరించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, డీఈవోల నేతృత్వంలో పాఠశాలలను పరిశీలించి ఫీజుల నిర్ణయంపై నివేదిక సమరి?పంచాలని సీఎం సూచించారు. రాష్ట్ర స్థాయిలో రిటైర్డ్ జడ్జి లేదా రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ స్థాయిలో కమిటీ ఏర్పాటు చేసి, ఫీజుల నియంత్రణను ప్రభుత్వం పరిశీలిస్తుందని తెలిపారు. ఫీజుల నియంత్రణకు సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులు, మేధావులు, సామాజికవేత్తల అభిప్రాయ సేకరణకు ముసాయిదాను ప్రజలకు అందుబాటులో (పబ్లిక్ డొమైన్‌లో) ఉంచాలని సూచించారు.

**కేకే కమిటీ కమిషన్ నివేదిక పరిశీలించాలి**

తెలంగాణ విద్యా విధానంపై రాష్ట్ర విద్యా కమిషన్ రూపొందించిన నివేదికను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పరిశీలించారు. నివేదికలోని చట్టబద్ధత కల్పించాల్సిన అంశాలను ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు నేతృత్వంలోని కమిటీ పరిశీలించాలని సూచించారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ దేవసేన, ఇంటర్మీడియెట్ బోర్డు డైరెక్టర్ కృష్ణ ఆదిత్య, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి వెంకటేష్ ధోత్రే, పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికొలస్ తదితరులు పాల్గొన్నారు.

# పబ్లిక్ స్కూళ్లతో విద్యావ్యవస్థ బలోపేతం

-మొదటిపేజీ తరువాయి

ప్రాథమిక పాఠశాలల్లోనే ప్రారంభించాలి. ఒకటవ తరగతి నుంచే తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్, హిందీ భాషలతో కూడిన విధానాన్ని అమలు చేయాలి. ప్రాథమిక స్థాయి నుంచే బోధనా మాధ్యమం ఇంగ్లిష్‌లో ఉండటం ప్రయోజనకరం. ప్రస్తుతం ఉన్న 6--14 ఏళ్ల పరిమితిని 3 నుండి 18 సంవత్సరాలుగా మార్చి నిర్బంధ విద్యను అందించాలి. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సును రద్దు చేయాలి. బి.ఎడ్‌ను ప్రైమరీ (నర్సరీ--5వ తరగతి), సెకండరీ (6--12వ తరగతి) గా విభజించాలి.

**కోచింగ్ వ్యాపారాన్ని నిషేధించాలి**

మధ్యాహ్న భోజనానికి ఇచ్చే ధరను పెంచాలి. మెనూలో గుడ్డు, అరటి పండు ఉండేలా చూడాలి. 12వ తరగతిలో మాత్రమే బోర్డు ఎగ్జామ్ నిర్వహించాలి. ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఈఏపీ సెట్‌ను రద్దు చేసి, ఇంటర్ మార్కుల ఆధారంగానే కోర్సుల్లో ప్రవేశం కల్పించాలి. ప్రైవేట్ జూనియర్ కళాశాలల పేరుతో నిర్వహించే పోటీ పరీక్షల కోచింగ్ వ్యాపారాన్ని నిషేధించాలి.

**ఫీజుల నియంత్రణకు కమిషన్**

విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న సుమా రు 72 శాతం రెగ్యులర్ అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. పాఠశాలలు, ఉన్నత విద్యా సంస్థల ప్రమాణాలను అంచనా వేయడా నికి 'తెలంగాణ ఎడ్యుకేషన్ స్టాండర్డ్స్ అథారి టీ'ని ఏర్పాటు చేయాలి. ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రించడానికి చట్టబద్ధమై న కమిషన్ ఏర్పాటు చేయాలి. విద్యకు రాష్ట్ర బడ్జెట్‌లో 18 శాతం కేటాయించాలి..' అని సిఫారసు చేసినట్లు తెలిపారు. తెలంగాణ విద్యా విధానం అమలు కోసం ఏడేళ్ల రోడ్ మ్యాప్‌ను కమిషన్ సిద్ధం చేసింది. దీని ద్వారా సుమారు 2 వేల పాఠశాలలను అభివృద్ధి చేయవచ్చని పేర్కొంది. మీడియా సమావేశంలో కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు, డాక్టర్ చారకొండ వెంకటేశ్, కె.జ్యోత్స్న శివారెడ్డి పాల్గొన్నారు.

# పసిపిల్లల హృదయాలయం

కల్లాకపటం తెలియని పసి మనసులు.. హృద్రోగ సమస్యలతో తల్లడిల్లుతుంటే.. మేమున్నాం అంటూ అక్కున చేర్చుకుంటోంది సిద్దిపేట జిల్లా కొండపాకలోని శ్రీసత్యసాయి సంజీవని సెంటర్ ఫర్ చైల్డ్ హార్ట్‌కేర్ అండ్ రీసెర్చ్. రూ.లక్షల విలువైన అత్యాధునిక వైద్యాన్ని పూర్తి ఉచితంగా అందిస్తూ బాధాతప్తులకు సాంత్వన చేకూర్చుతోంది. తీవ్ర మనోవేదనకు గురైన కన్నవాళ్లను ఓదార్చుతూ పిల్లల ఆరోగ్య భవిష్యత్తుకు భరోసానిస్తోంది. ఇప్పటివరకు భారత్‌తోపాటు మరో 14 దేశాలకు చెందిన 233 మంది చిన్నారులకు ఓపెన్ హార్ట్ సర్జరీలు, 103 మంది పిల్లలకు కార్డియాక్ ఇంటర్వెన్షన్లు విజయవంతంగా పూర్తి చేసి 336 మంది ప్రాణం నిలిపినట్లు సంస్థ చైర్మన్ డా.సి.శ్రీనివాస్ తెలిపారు.

**అంతా ఉచితమే...**

మనదేశంలో ఏటా 3.5 లక్షల మంది చిన్నారులు గుండె సంబంధిత సమస్యలతో జన్మిస్తున్నారు. సరైన వైద్యం అందక సుమారు లక్ష మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి వారికి శ్రీసత్యసాయి సంజీవని సెంటర్ ఫర్ చైల్డ్ హార్ట్‌కేర్ అండ్ రీసెర్చ్ వరదాయినిగా నిలుస్తోంది. సిద్దిపేట జిల్లాలోని కొండపాకతోపాటు నయా రాయ్‌పుర్(ఛత్తీస్‌గఢ్), పల్వాల్ (హరియాణా), నవీ ముంబయి(మహారాష్ట్ర)లలోనూ వైద్యాలయాలు నెలకొల్పి పూర్తి ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తున్నారు. సత్యసాయి హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఆసుపత్రుల్లో పుట్టుకతోనే గుండె సంబంధ వ్యాధులతో జన్మించిన శిశువులకు శస్త్రచికిత్స మొదలుకొని ఔషధాల వరకు అంతా ఉచితమే.



చిన్నారితోపాటు ఇద్దరికి భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. ఈ ఆసుపత్రి వలంటీర్లు మారుమూల గ్రామాలు, గిరిజన తండాల్లో శిబిరాలు నిర్వహించి మరీ లోపాలున్న చిన్నారులను గుర్తిస్తున్నారు. కొండపాకలో 2024 నవంబరు 23న హృదయాలయాన్ని ప్రారంభించారు. వంద పడకల సామర్థ్యం ఉన్న ఈ ఆసుపత్రిలో ఆధునిక వైద్య పరికరాలు, నిష్ణాతులైన వైద్యులు, పూర్తిస్థాయి డిజిటల్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. 24 గంటలపాటు వైద్యసేవలు అందుబాటులో ఉంటాయి. ఇక్కడ అత్యాధునిక క్యాథ్ ల్యాబ్(క్యాథెటరైజేషన్ లాబొరేటరీ) ఉంది. సాధారణ శస్త్రచికిత్సలలో శరీరాన్ని పెద్దగా కోయాల్సి ఉండగా.. దీనితో కనీస కోతతో చికిత్స చేస్తారు. శరీరంలోని రక్తనాళాల ద్వారా (చేయి లేదా కాలు) నుంచి సన్నని గొట్టాన్ని (క్యాథెటర్) గుండె వరకు పంపించి పరీక్షలు నిర్వహిస్తారు.

**పుట్టుకతో వచ్చే లోపాలకే...**

పుట్టుకతో వచ్చే గుండె లోపాలకు మాత్రమే ఇక్కడ చికిత్స అందిస్తారు. సర్జరీలు చేస్తారు. గుండెకు రంధ్రం, వాల్వ్‌ల పనితీరు దెబ్బ తినడం, వ్యవస్థ సరిగా లేకపోవడం, ప్రతిస్పందనలు కొరవడడం, రక్తసరఫరాలో తేడాలు.. ఇలా 100 రకాల సమస్యల్ని సరిచేస్తారు. తల్లి గర్భంలోనే ఉత్పన్నమయ్యే ప్రమాదకరమైన గుండె సమస్యలు (కంజెనిటల్ హార్ట్ డిఫెక్ట్స్)కు మెరుగైన చికిత్సలు అందిస్తున్నారు.

## ప్రతి పేదవాడికీ న్యాయం చేస్తాం

హైదరాబాద్

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నుంచి ఇప్పటివరకు జరిగిన పార్లమెంట్, ఉప ఎన్నికలు, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టడాన్ని జీర్ణించుకోలేక ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. ఫామ్‌హౌస్‌లో కూర్చుని కేసీఆర్ కుట్రలు చేస్తుంటే..బావ, బావమరిది హరీశ్‌రావు, కేటీఆర్ తెలంగాణ సమాజంపైన, ప్రభుత్వంపైన విషం కక్కుతున్నారని తీవ్ర విమర్శలు చేశారు. కాళేశ్వరంలో దోచుకున్న, దాచుకున్న సొమ్ములో కొంత భాగాన్ని బయటకు తీసి పేదలకు ఇళ్లు కట్టించి పాప పరిహారం చేసుకోవాలని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు సూచించారు. గురువారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీలు బలరాంనాయక్, రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, మాధవరెడ్డితో కలసి ముగ్గురు మంత్రులు మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, 2023 జూలై 15న వెలుగుమట్లలో బీఆర్ఎస్ ప్రభుత్వమే పేదల ఇళ్లను కూలగొట్టించిందని చెబుతూ అప్పటి కూల్చివేత సంఘటనల ఫొటోలను మీడియాకు చూపారు. వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేతలపై బీఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలపై మీడియా ప్రశ్నించగా, మంత్రి పొంగులేటి పైవిధంగా స్పందించారు. హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా అక్కడ అక్రమంగా ఉన్న ఇళ్లను తొలగించారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అన్యాయం చేశారని ఆరోపించారు. వెలుగుమట్లలో ఇల్లు కోల్పోయే పేదలకు ఇళ్లు తిరిగి కట్టిస్తామని హామీ ఇచ్చి బీఆర్ఎస్ గాలికి వదిలేసిందన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం పేదోడి ప్రభుత్వమని, పేదలే ఇందిరమ్మ ప్రభుత్వానికి పేటెంట్ అని మంత్రి వ్యాఖ్యానించారు. వెలుగుమట్లలో ఇల్లు కోల్పోయే ప్రతి పేదవాడికి న్యాయం చేస్తామన్నారు. 'వెలుగుమట్లలో అర్హులైన పేదలందరికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు ఇంటి స్థలం, ఇళ్లు ఇస్తాం. ఏ ఒక్క పేదవాడికి అన్యాయం జరగకుండా చూస్తాం'అన్నారు.

**పేదల కష్టాలు తీర్చేందుకు జలయజ్ఞం ప్రారంభించారు**

తన పాదయాత్రలో భాగంగా పేదల కష్టాలను నేరుగా తెలుసుకున్న దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి..వారి కష్టాలు తీరాలంటే గోదావరి, కృష్ణా పరీవాహక ప్రాంతాల్లో ప్రాజెక్టుల నిర్మాణంతో రైతన్నకు సమృద్ధిగా సాగునీరు ఇవ్వాలని నిర్ణయించారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. జలయజ్ఞంతో ప్రాణహిత--చేవెళ్ల సహా అనేక ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. మార్చి 16 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలకు ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్, బావ బావమరుదులు హరీశ్‌రావు, కేటీఆర్ వచ్చి మాట్లాడాలి. తమ తప్పులు ఎక్కడ బయటపడతాయోనన్న భయంతోనే బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీలో ఉండకుండా సాకులతో బయటకు పోతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వలేదని..కానీ తాము కచ్చితంగా అవకాశం ఇస్తామని, సభకు వచ్చి మంచి సలహాలు, సూచనలు ఇవ్వాలని పొంగులేటి కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..బీఆర్ఎస్ ప్రభుత్వం నీటి ప్రాజెక్టుల విషయంలో ఉత్తర తెలంగాణకు పూర్తిగా అన్యాయం చేసిందన్నారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ ఎందుకు జరపడం లేదని కేంద్రంలోని బీజేపీని ప్రశ్నించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ బీఆర్ఎస్ అవినీతికి పాల్పడినందువల్లే దేశంలోనే అత్యంత ధనిక ప్రాంతీయ పార్టీగా మారిందని విమర్శించారు. సుమారు వెయ్యి కోట్ల రూపాయల ఫిక్స్‌డ్ డిపాజిట్లు , ఎలక్ట్రోరల్ బాండ్లు దీనికి నిదర్శనమన్నారు.

## హైదరాబాద్‌కు 'హార్వర్డ్'



-మొదటిపేజీ తరువాయి

తర్వాత ఇక్కడే ఒక స్టడీ సెంటర్‌ను తెరిచేందుకు చర్యలు తీసుకుంటాం. వివిధ రకాల ఎగ్జిక్యూటివ్ కోర్సులు ఇక్కడ నిర్వహిస్తారు. ఆసక్తి ఉన్నవాళ్లు ఎంపిక చేసుకున్న కోర్సుల్లో చేరవచ్చు. ఇక్కడే తరగతులకు హాజరు కావొచ్చు. కోర్సు పూర్తయిన తర్వాత సర్టిఫికెట్లు తీసుకోవచ్చు. గ్రూప్--1, గ్రూప్--2 ఉద్యోగాలు సాధించిన మీరు కూడా ఈ కోర్సులు చేయవచ్చు..' అని సీఎం తెలిపారు.

**తెలంగాణ ప్రజలు ఆధిపత్యం సహించలేరు..**

'మీరు ఎంతో కష్టపడి, లక్షలాది మందితో పోటీ పడి ఉద్యోగాలు సాధించారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అధికారులకు అభినందనలు. మీరు మొన్నటివరకు విద్యార్థులు..నిన్నటివరకు నిరుద్యోగులు..ఈ రోజు అధికా రులుగా బాధ్యతలు తీసుకుంటున్నారు. ప్రజాపాలనలో మీరంతా ప్రజలకు నేరుగా సేవలు అందించబోతున్నారు. తెలంగాణ ప్రజలు ఆకలినైనా సహిస్తారు కానీ ఆధిపత్యాన్ని సహించలేరు. రాంజీ గోండ్, కుమ్రుంభీం రాజ్యాల కోసం పోరాటం చేయలేదు. అధిపత్యం చెలాయిస్తున్న వారిపై తిరు గుబాటు చేశారు. కాకతీయ సామ్రాజ్యంపై సమ్మక్క, సారల మ్మ తిరుగుబాటు చేశారు. అందుకే వారు వన దేవతలుగా గౌరవించబడుతున్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సమాన అవకాశాల కోసం వారు అమరవీరులయ్యారు.

**బాధ్యత మరవొద్దు.. పతనం కావొద్దు**

అధికారులుగా బాధ్యతలు స్వీకరిస్తున్న మీరంతా ప్రజల ఆకాంక్షలు, అమరవీరుల స్ఫూర్తిని ప్రతిక్షణం గుర్తు పెట్టుకోవాలి. 2011 తర్వాత 14 ఏళ్ల పాటు గ్రూప్--1 ఉద్యోగాలు భర్తీ చేయలేదు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రూప్--1 నిర్వహించి నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చింది. తొలుత టీజీపీఎస్‌ను పూర్తిగా ప్రక్షాళన చేసింది. డీజీపీగా పనిచేసిన వ్యక్తిని చైర్మన్‌గా నియమించాం. రిజిస్ట్రార్, ప్రొఫెసర్లను సభ్యులుగా నియమించాం. ప్రశ్న పత్రాలు జిరాక్స్ సెంటర్‌లలో అమ్మేందుకు అవకాశం లేకుండా చేశాం. కొందరు గిట్టనివాళ్లు కోర్టులకెక్కి ఉద్యోగాలను ఆపేందుకు ప్రయత్నించారు. కానీ అన్ని కోర్టుల్లో అభ్యర్థుల తరఫున బలంగా వాదించి కోర్టులను ఒప్పించి ఉద్యోగాల భర్తీని పూర్తి చేశాం. అధికారులుగా మారిన తర్వాత బాధ్యత మరిచిపోయి మనిషిగా పతనం కావొద్దు..' అని రేవంత్ చెప్పారు.

**తల్లిదండ్రులకు అండగా ఉండండి..**

'సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరవేసే బాధ్యత మీపైనే ఉంది. మీరంతా ఆఫీసుకు వెళ్ళేముందు ఎస్ఆర్ శంకరన్‌ను తలుచుకోవాలి. పేదవారికి సాయం చేసే విషయంలో మీ తల్లిదండ్రులను గుర్తు పెట్టుకోవాలి. తల్లిదండ్రులను గౌరవిస్తూ వారికి అండగా నిలవండి. తల్లిదండ్రులను పట్టించుకోని వాళ్ల జీతంలో 10--15 శాతం కోత పెట్టేలా త్వరలో చట్టం చేస్తున్నాం..' అని ముఖ్యమంత్రి తెలిపారు. అంతకుముందు కొత్త అధికారుల శిక్షణకు సంబంధించిన ఫొటో ప్రదర్శనను రేవంత్ తిలకించారు.

